క్లుప్తంగా

మదనపల్లె ఏడీఏగా దీక్షాకుమారి

మదనపల్లె: వ్యవసాయశాఖ మదనపల్లె ఏడీఏగా దీక్షాకుమారి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న శివశంకర్ గుంటూరు రాష్ట్ర కార్యాలయానికి బదిలీకాగా ఆయన స్థానంలో మదనపల్లె భూసారపరీక్షా కేంద్రం ఏడీఏగా పనిచేస్తున్న దీక్షాకుమారికి వ్యవసాయశాఖ ఏడీఏగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఏడీఏ శివశంకర్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏఓ నాగప్రసాద్, ఏడీఏ కార్యాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 15మంది అరెస్ట్

బి.కొత్తకోట: బి.కొత్తకోటలోని బుధవారం రాత్రి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 15 మందిని అరెస్ట్ చేశామని ఎస్ఐ రామమోహన్ తెలిపారు. వివిధ ప్రాంతాల్లో మద్యం సేవిస్తున్న ప్రాంతాలపై దాడులు నిర్వహించామని తెలిపారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, తాగి బైక్‌లు నడిపినా కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంగళ్లు వాసికి డాక్టరేట్


షబ్బీర్ బాషా

కురబలకోట: కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన ఎ. షబ్బీర్ బాషాకు ఎస్వీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఇతను ఉర్దూ విభాగాధిపతి డాక్టర్ మహమ్మద్ నిస్సార్ అహ్మద్ పర్యవేక్షణలో రాయలసీమలో 1960 తర్వాత ఉర్దూ పద్యం అనే అంశంపై పరిశోధనకు పీహెచ్‌డీ లభించింది. ప్రస్తుతం ఇతను గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అతిథి ఆచార్యులుగా పనిచేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలన

బి.కొత్తకోట: ఓటర్ల జాబితాపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నామని హెచ్ఎన్ఎస్ఎస్ భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సందీప్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన అధికారులతో కలిసి బి.కొత్తకోట నగర పంచాయతీలోని పోకనాటివీధి, పీటీఎంరోడ్డు, పంచాయతీ వీధి, దిగువబస్టాండ్‌లలో ఇంటింటికి వెళ్లి జాబితాను పరిశీలించారు. మరణించిన వారి ఓటర్ల వివరాలను అడిగిన ఆయన ఫాం–7 ద్వారా మాత్రమే మరణ ధృవీకరణ పత్రాన్ని జతచేసి దరఖాస్తు చేసుకోవాలని కుటుంబీకులకు సూచించారు. ఓటర్ల తొలగింపుపై బీఎల్‌ఓలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. తహసీల్దార్ రఫీక్‌అహ్మద్, కమిషనర్ పీఆర్.మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగల విశ్వరూప సభను విజయవంతం చేయండి

తంబళ్లపల్లె: ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ హైదరాబాద్‌లో తలపెట్టిన మాదిగల విశ్వరూప సభను విజయవంతం చేయాలని మహాసేన సోషలిస్టు పార్టీ నాయకులు చిన్న కోరారు. మండలంలోని జుంజురపెంటలో మంగళవారం మాదిగలతో సమావేశం నిర్వహించారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎన్నికల సమయంలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. సమావేశంలో ఎంఎస్‌పీ నాయకులు వెంకటప్ప, మల్లికార్జున, రమణప్ప, గంగులప్ప, తిప్పన్న, సోమశేఖర్, శ్రీనివాసులు, మంగళమ్మ భారతి, అమరావతిలు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మదనపల్లె సిటీ: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి తెలిపారు. ఉదయం 11గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగే సమావేశాని కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

ట్రాన్స్‌కో ఈస్టు సెక్షన్ ఏఈగా రెడ్డికుమార్

మదనపల్లె సిటీ: ట్రాన్స్‌కో మదనపల్లె పట్టణ ఈస్టు సెక్షన్ ఏఈగా రెడ్డికుమార్ నియమితులయ్యారు. సీటీఎం సెక్షన్‌లో పని చేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఏడీఈ దుర్గాగందబాబుకు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఈలు నరసింహారెడ్డి, వసంత్‌రెడ్డి, గోవిందరెడ్డి, ముజమిల్, లైన్ ఇన్స్‌పెక్టర్‌లు నాగరాజు వేమారెడ్డి, రామక్రిష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి,అర్జున లైన్‌మెన్లు శేషాద్రి నాగరాజు, లక్ష్మీనారాయణ,ఆనందరెడ్డిలు కలిసి అభినందనలు తెలియజేశారు.

పల్లెబాటలో సమస్యల పరిష్కారం

తంబళ్లపల్లె: పల్లెబాట కార్యక్రమంతో గ్రామాల్లో ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు ఎంపీపీ అనసూయమ్మ తెలిపారు. బుధవారం జుంజురపెంటలో సర్పంచ్ భూదేవి ఆధ్వర్యంలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బురుజుపల్లెలో రూ.9 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, బండారువారిపల్లెలో రూ.5లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. రాష్ట్రపద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, సింగిల్‌విండో చైర్మన్ భార్గవరెడ్డి, మండల అభివృద్ధిక మిటీ నారాయణరెడ్డి, ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఏపీవో అంజనప్ప, ఏపీఎం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాల్లో సంక్షేమ కాంతులు

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : పేద కుటుంబాల్లో సంక్షేమ కాంతులు నింపడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మకాలనీలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల రాష్ట్రప్రభుత్వ పాలనలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు, ఆర్థికంగా చేకూరిన లబ్ధి చదివి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వ పాలన దిగ్విజయంగా జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వానికి ఎంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఇచ్చిన హామీలే కాకుండా ఎన్నో కొత్తపథకాలు అమలు చేసినట్లు చెప్పారు. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వీధుల్లో రోడ్లు, కాలువలు, విద్యుత్ లైన్ల సమస్యలు పరిష్కరించాలని స్థానికులు విన్నవించారు. కొన్ని ఇళ్లకు తాగునీరు అందడం లేదని, పైపులైన్లు సరి చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మౌలిక సదుపాయాలు తక్షణం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హులైన వారికి ఇళ్లు, పింఛన్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జి.వి. రాకేష్‌రెడ్డి, సర్పంచ్‌లు హరిణి, దండు జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ బిందు, నాయకులు రమేష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, ఎస్.వి. చలపతి, ఆనంద్, ఎ.ఎస్. హుమయూన్, మోహన్‌రెడ్డి, వెంకటరమణ, సుధాకర్‌రెడ్డి, నాగభూషణంరెడ్డి, దావూద్, జయచంద్రారెడ్డి, ఉదయ్, గరుడారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే సీఎం జగనన్న లక్ష్యం


సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

పెద్దతిప్పసముద్రం: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా సీఎం జగనన్న రాష్ట్రంలో పారదర్శకంగా పరిపాలన సాగిస్తున్నారని ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, శివన్న, సుబ్బరాం, కొండా సిద్ధార్థ, డ్రిప్ రమణ అన్నారు. బుధవారం మండల స్థాయి అధికారులతో కలసి రంగసముద్రం పంచాయతీలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గడప, గడపకూ వెళ్ళి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని, పక్కా గృహాలు మంజూరు చేయాలని పలువురు పల్లెబాట బృందం దృష్టికి తీసుకు వచ్చారు. గత టీడీపీ ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను బేరీజు వేసుకుని మళ్ళీ ఇలాంటి ప్రభుత్వమే వచ్చేలా మీరంతా ఆశీర్వదించాలని ప్రజలను అభ్యర్థించారు. సర్పంచ్ బొక్కసం శివప్రసాద్, ఎంపీటీసీ సుజాత, మాజీ సర్పంచ్ సవరాల రవిశంకర్, వాటర్‌షెడ్ చైర్మన్ సుబ్రమణ్యం, చలపతి, కన్వీనర్ రామిరెడ్డి, చాప సుబ్రమణ్యం, జనార్ధన్, సురేష్, ఖాజా, గణేష్, వెంకట్, గణపతి, సందీప్‌తో పాటు అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సారా తయారీ, విక్రయాలు మానుకోండి

–ఎస్ఈబీ ఇన్స్‌పెక్టర్ శ్రీహరిరెడ్డి


అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి

మదనపల్లె: సారా అక్రమ తయారీ, విక్రయాలు మానుకోవాలని ఎస్ఈబీ ఇన్స్‌పెక్టర్ శ్రీహరిరెడ్డి సూచించారు. బుధవారం మండంలోని నారామాకులతాండాలో పలుమార్లు సారా కేసులలో నమోదైన నిందితులకు అవగాహన కల్పించారు. అక్రమ నాటుసారా తయారీ, రవాణా, విక్రయం వల్ల ఎదుర్కోవాల్సిన కేసులు, సమస్యలపై వివరించారు. పలు మార్లు సారా కేసులకు పాల్పడితే నిందితులపై పీడీ యాక్టు నమోదు చేయడంతో పాటు జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. అసాంఘి కార్యకలాపాలకు స్వస్తి చెప్పి గౌరవప్రదంగా జీవించాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ తాము వ్యవసాయం చేసుకుని జీవించేందుకు సాగునీటి బోర్లు వేసుకున్నామని, వాటికి విద్యుత్ కనెక్షన్లు అధికారులతో మాట్లాడి ఇప్పిస్తే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు మానుకుని వ్యవసాయం చేసుకుంటామని చెప్పారు. దీనిపై ఇన్‌స్పెక్టర్ స్పందిస్తూ విద్యుత్ అధికారులతో మాట్లాడి తన వంతు కృషి చేస్తానన్నారు. మరోసారి అక్రమ సారా తయారీ, రవాణా కేసులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ములకలచెరువు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి కుల, మత బేధాలు లేకుండా... పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎంపీపీ సాయిలీలా, సర్పంచు సి. వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సెంట్రల్‌స్కూల్ పంచాయతీల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ప్రజలనుంచి వచ్చిన వినతులను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. నల్లగుట్టపల్లె, సెంట్రల్‌స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు శిలాఫలకాలను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పల్లె పల్లెలు అభివృద్ధి చెందాయని చెప్పారు. ఇంటి వద్దకే వెళ్లి ప్రజలకు పథకాలు అందచేస్తున్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, సురేంద్ర, మోహన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, గంగుల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత

రామసముద్రం: చిత్తూరు జిల్లా సహకార బ్యాంకు, పుంగనూరు బ్రాంచ్ రామసముద్రం సొసైటీ బ్యాంకు ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యత కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్యంగా రైతు సోదరులకు క్రాప్ రుణాలు, మహిళా సంఘాలకు పొందుపు రుణాలు, బంగారంపై రుణాలు, ముఖ్యంగా సామాజిక భద్రత పథకాలు , ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాయోజన, అటల్‌పెన్షన్ యోజన, సైబర్ మోసాల నివారణ, నగదు రహిత లావాదేవీలపై కర్నూల్‌కు చెందిన ఎంవిరూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ వారు అవగాహన కల్పించారు. కళాజాత బృందం మాటలు, పాటల ద్వారా ప్రజలకు మ్యాజిక్ షో నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కె.నాగ్రప్రసాద్, సీఈవో బి.చంద్రశేఖర్, ఏఈవో సుబ్రమణ్యం, అటెండర్ గంగప్ప, కళాజాత బృందం సభ్యులు విజయ్ , ఆనంద్, రాఘవేంద్ర, చిరంజీవి, పొదుపు మహిళా సంఘాలు, రైతు సంఘాలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోండి

పెద్దతిప్పసముద్రం: మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు నుంచి పొందే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ శ్రీవాణి కిశోర్‌కుమార్ రెడ్డి సూచించారు. బుధవారం సంధ్యా సమయం మేళాలో భాగంగా బూర్లపల్లి సచివాలయంలో మహిళా సంఘాల సభ్యులతో సమీక్షించారు. సంఘాల సభ్యులు రుణాలను పొందడమే గాక తిరిగి వాటిని సకాలంలో బ్యాంకులకు చెల్లించి అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని హితబోధ చేసారు. అలాగే బ్యాంకు ద్వారా మంజూరు చేస్తున్న వ్యవసాయ పంట రుణాలు, గృహాలపై రుణాలు, ఇన్సూరెన్స్, ఫిక్సెడ్ డిపాజిట్లపై వడ్డీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పలు మహిళా సంఘాలకు మంజూరైన చెక్కులను అందజేశారు. సర్పంచ్ సుబ్బిరెడ్డి, ఎంపీటీసీ నాగార్జునరెడ్డి, కన్వీనర్ మోహన్‌రెడ్డి, కటికపల్లి శివారెడ్డి, పీటీఎం, బి.కొత్తకోట ఎస్‌బీఐ మేనేజర్లు రెడ్డి నగేష్, నిసారుద్దీన్, ఫీల్డ్ ఆఫీసర్ ఆంజినేయులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

మదనపల్లె సిటీ: రాఖీ పండుగను పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో మదనపల్లె పట్టణం భారతీ జూనియర్ కాలేజీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఒకరికొకరు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు సాహితీష్ మాట్లాడుతూ రాఖీ పండుగ అనేది అన్నాచెల్లెళ్ల మధ్య అనుబంధమే కాకుండా విద్యార్థు మధ్య సోదరభావాన్ని పెంపొందిచడానికి దోహదపడుతుందన్నారు. విద్యార్థులు ఒకరికి ఒకరు రక్ష ధరిస్తూ నేను నీకు రక్ష.. నీవు నాకు రక్ష అని చెప్తూ రాఖీలు కట్టుకున్నారు.

వాల్మీకిపురం : వాల్మీకిపురం డాక్టర్ డీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం ఘనంగా రక్షాబంధన్ జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేసే అధికారులకు రక్షాబంధన్ కట్టి స్వీట్లును పంచిపెట్టారు. అనంతరం ప్రిన్సిపాల్ కల్పన మాట్లాడుతూ పవిత్రమైన సోదరభావానికి రాఖీ పండుగ నిదర్శమన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది రామలక్ష్మమ్మ, ధనలక్ష్మీ, రేఖ, గౌతమి, కౌసర్, సత్యమ్మ, శోభన, శైలజ, జ్యోతి, లావణ్య, బేబి ప్రసన్న, గిరిజ రాణి, ధనంజయులు, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

పల్లెబాట వినతులపై ప్రత్యేక చర్యలు

బి.కొత్తకోట: పల్లెబాటలో ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై ప్రత్యేక చర్యలు తీసుకుని పరిష్కరించనున్నట్లు ఎంపీడీఓ మంగళం శంకరయ్య అన్నారు. బుధవారం మండలంలోని గట్టు పంచాయతీలోని కొత్తపల్లె, నల్లగుట్టపల్లె, గట్టు, గుండ్లపల్లె, శీతివారిపల్లె, దిన్నిమీదపల్లెల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పల్లెబాట నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందుతున్నాయా లేదా, సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. అర్హులై ఉండి పథకాలు అందనివారి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర, బుద్దల వెంకటరెడ్డి, సర్పంచులు ఉమామహేశ్వరీ, భీమగాని నాగిరెడ్డి, జయరామిరెడ్డి, మాజీ సర్పంచు ముబీనా, ఎంపీటీసీలు ఆకుల కృష్ణమూర్తి, రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు మాలిక్, కార్యవర్గ సభ్యులు మియాసాబ్, తన్వీర్, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరించండి

కురబలకోట: పల్లెల్లో జరిగిన అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరో సారి ఆదరించాలని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి దస్తగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ డీఆర్.ఉమాపతిరెడ్డి కోరారు. పల్లెబాటలో భాగంగా బుధవారం దాదంవారిపల్లె గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రూ.1.10 కోట్లతో చేపట్టిన కోసువారిపల్లె రోడ్డు నుంచి ఎగువ గొల్లపల్లె వరకు వేసిన తారు రోడ్డును ప్రారంభించారు. విశ్వేశ్వర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితవాడల అభివృద్ధికి కృషి

పీలేరు రూరల్ : మండలంలోని అన్ని దళిత గ్రామాల్లో అభివృద్ధికి కృషి చేస్తామని తహసీల్దారు కె. ధనుంజయలు అన్నారు. బుధవారం మండలంలోని దొడ్డిపల్లి పంచాయతీ అన్నంగి దళితవాడలో పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ దళిత గ్రామాలల్లో ఏవైనా సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ మూడు నెలలగా తాగునీటి సమస్య ఉందని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. అలాగే శశ్మన స్థలం కేటాయించాలని విన్నవించారు. సమస్యలను ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ రమణ, ఎంఈఓ పద్మావతి, ఈఓపీఆర్‌డీ జయమ్మ, సర్పంచ్ సుబ్బులమ్మ, ఎంపీటీసీ శ్యామల, సీడీపీఓ స్వరూప వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

కలకడ : మండలంలో నిర్మాణాలు చేపట్టిన జగనన్న కాలనీలలో వెంటనే మౌలిక వసతులు కల్పించాలని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. బుధవారం మండలంలోని కలకడ, కె.బాటవారిపల్లె పంచాయతీలలో జరుగుతున్న జగనన్న కాలనీలను సందర్శించి ఇంటి నిర్మాణాలు లబ్ధిదారులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. త్వరిత గతిన బిల్లులు, సిమెంట్‌ను ప్రభుత్వం అందిస్తుందని గుర్తు చేశారు. ప్రతి వీధికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఉచితంగా ప్రభుత్వం మీటర్లు మంజూరు చేస్తుందని ఈ విషయం లబ్ధిదారులకు తెలియజేయాలని విద్యుత్ శాఖ ఏఈ వరప్రసాద్‌కు సూచించారు.

డాక్యుమెంట్ రైటర్ల ధర్నా

మదనపల్లె సిటీ: పాత పద్ధతితోనే రిజిస్ట్రేషన్‌లు జరగాలని కోరుతూ బుధవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్యుమెంట రైటర్ల సంఘ రాష్ట్ర కార్యదర్శి కంగేరి నంద మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న కొత్త విధానంతో స్టాంపు వెండర్లు, డాక్యుమెంట్ రైటర్ల కుటుంబాలు రోడ్డున పడనున్నాయని తెలిపారు. నూతన విధానంతో రిజిస్ట్రేషన్ దస్తావేజుల్లో క్రయవిక్రయదారులకు అనేక సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు గుణశేఖర్,రాజేంద్ర, నూర్ మహమ్మద్, లావణ్య బాబు, నూర్, రెడ్డప్పయాదవ్‌లు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : రాష్ట్ర ప్రభుత్వం కార్డ్ 2.0 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పద్ధతితో ఎంతో మంది దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు రోడ్డుపాలవుతారని వాల్మీకిపురం సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయ పరిధిలోని దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు వ్యతిరేకించారు. రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు పెనుమాక వెంకట సుబ్బారావు వారి ఆదేశాల మేరకు బుధవారం దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు స్థానిక సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం తెలియజేశారు.

కలికిరి: ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టి కార్డ్ ప్రైమ్ 2.0కు నిరసనగా దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్ల సంఘం పిలుపు మేరకు కలికిరిలో పెన్‌డౌన్ పాటించారు. కార్డ్‌ప్రైమ్ 2.0 ప్రజలకు ఎటువంటి ఉపయోగం ఉండక పోగా, ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా ఉన్న దస్తావేజు లేఖరులు, స్టాంపువెండర్ల కుటుంబాలు రోడ్డునపడుతాయన్నారు. పెన్‌డౌన్‌తో సబ్ రిజిస్ట్రారు కార్యాలయం బోసిపోయింది.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఉత్తమ వైద్య సేవలు

–డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య


ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలను తనిఖీ చేస్తున్న జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య

కలకడ : ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రతి గ్రామంలో ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య తెలిపారు. బుధవారం మండలంలోని గుడిబండ పంచాయతీ గొళ్ళపల్లెలో 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ అందిస్తున్న వైద్య సేవలను ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి వద్దనే బీపీ, షుగర్, ఫీవర్, దగ్గు, జలుబు వంటివి పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి ఉచితంగా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో కనీసం 5–10 సురక్షిత ప్రసవాలు చేయాలన్నారు. ప్రతి గర్భిణి వారి ఆరోగ్య కార్డు తీసుకుని నెలవారి రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. అనంతరం కలకడ పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులు, మందుల నిల్వ, రక్త పరీక్షల కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ డీఎంఓ వేణుగోపాల్, డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ మోహన్, జిల్లా హెల్త్‌ఎడ్యుకేటర్ బలరాంరాజు, సిబ్బంది లక్ష్మీనారాయణ, ఎంపీహెచ్ఈఓ వెంకటేశు, సూపర్‌వైజర్ రామక్రిష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సర్వే పకడ్బందీగా నిర్వహించాలి


ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీఓ మురళి


నాయకులతో మాట్లాడుతున్న సందీప్‌కుమార్

మదనపల్లె సిటీ: ఓటరు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి బీఎల్‌ఓలకు ఆదేశించారు. బుధవారం మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీలో జరుగుతున్న ఓటర్ల సర్వేను తనిఖీ చేశారు. స్థానికులను అడిగి తెలుసుకున్నారు. 18 ఏళ్ల నిండినవారిని ఓటర్లుగా చేర్పించాలని తెలిపారు. చనిపోయినవారి పేర్లు తొలగించాలన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాలో తప్పుప్పులను పరిశీలించాలన్నారు.

రైతుల సమక్షంలో రీ సర్వే చేయాలి

పీవోఎల్ఆర్(క్షుణమైన భూదస్త్రాలు)లో భాగంగా కేటాయించిన ఆరు ఫారాలను పూర్తి స్థాయిలో అవగాహన చేసుకుని క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమక్షంలో రీ సర్వే చేయాలని ఆర్డీవో మురళి తెలిపారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వస్థలాలు, డీకేటీ, ప్రైవేటు స్థలాలు, చెరువులు, కుంటలకు సంబంధించి గ్రామ రెవెన్యూ లెక్కల ప్రకారం తనిఖీ చేపి వివరాలను నమోదు చేయాలన్నారు. ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డు పూర్తికాగానే కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కోర్టు కేసులు, భాగపరిష్కారం, భూహక్కుదారులు, మ్యూటేషన్, డీకేటీ,ప్రభుత్వ భూములను ముందస్తుగా గుర్తించుకోవాలన్నారు. తప్పులు చేసిన సర్వేపై ఫిర్యాదులకు అవకాశం లేకుండా నిష్పక్షపాతంగా రీ సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌వో శేషయ్య, డిప్యూటీ సర్వేయర్ క్రిష్ణమూర్తి, తహశీల్దార్లు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా రూప కల్పనకు సహకరించాలి

కురబలకోట: ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజక వర్గ ఈఆర్‌ఓ సందీప్‌కుమార్ కోరారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రాజకీయ పార్టీలు, బీఎల్‌ఓలతో వేర్వేరుగా సమావేశం నిర్వ హించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, బోగస్ ఓట్లు తదితర వాటిపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. డబుల్ ఓట్లు ఉన్నా వాటిని తొలగించనున్నట్లు తెలిపారు. కొత్త పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఓటర్ల నమోదు పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. నియోజక వర్గ స్పెషలాఫీసర్ లక్ష్మీపతి, తహసీల్దారు ఎం.భీమేశ్వరరావు, ఎంపీపీ బి. దస్తగిరి, గోపాల్ రెడ్డి, ముస్తాక్, యాసాన్, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు


పెద్దమండ్యంలో పల్లెబాట నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెద్దమండ్యం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా అందిస్తున్నట్లు ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ఆదేశాల మేరకు పెద్దమండ్యంలో గ్రామ సర్పంచ్ సోదనపల్లె బాషా, ఎంపీటీసీ మంచూరి జయరాంల ఆధ్వర్యంలో బుధవారం పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. పెద్దమండ్యం, లక్ష్మీనగర్‌కాలనీ, పాతూరు, కుమ్మరానివీధి, విద్యానగర్‌కాలనీ లలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. నాలుగున్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, గ్రామాలలో కల్పించిన మౌలిక సదుపాయాల గురించి వారు వివరించారు. నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఒక వరమని అన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన విద్య, ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పల్లెకు రోడ్డు సౌకర్యం, తాగునీటి సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పీరమ్మ, ఎంపీడీవో శ్రీధర్ రావు, డిప్యూటీ తహసీల్దార్ గౌరీశంకర్, ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్, సర్పంచ్‌లు మొలక సాంబశివారెడ్డి, కంటి విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీ మంచూరి జయరాం, పార్టీ మండల కన్వీనర్ చాను, మండల జెఎస్‌వి కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ చాను, నాయకులు కోసూరి రామక్రిష్ణ, షబ్బీర్, కేశవ, గుర్రం చంద్ర, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో బీజేపీ బలోపేతానికి చర్యలు


మాట్లాడుతున్న మాజీ సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి

కలికిరి: క్షేత్ర స్థాయిలో బీజేపీ బలోపేతానికి చర్యలు తీసుకోనున్నట్లు ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా రాజంపేట పార్లమెంటు నియోజకవర్గంలోని అసెంబ్లీ సిగ్మెంట్‌ల వారిగా నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించామన్నారు. సంస్థాగతంగా పార్టీ బలోపేతం చేయడానికి మరింత కృషి చేయాల్సి ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాదరణ కలిగిన వ్యక్తులలో పీఎం మోదీ ముందంజలో ఉన్నారన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికలలోనూ బీజేపీ పూర్తి స్థాయిలో మెజారిటీ సాధించి అధికారంలోకి వస్తుందన్నారు. జిల్లాలోని అడవిపల్లి ప్రాజెక్టు నీటికి చిత్తూరు తాగునీటి అవసరాలకు పైపులైన్‌లు ఏర్పాటు చేస్తున్నారని, అయితే అడవిపల్లి ప్రాజెక్టు జిల్లా రైతులకు సాగు నీటి ఉపయోగపడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎపీ సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు నరేంద్రకుమార్‌రెడ్డి, యువమోర్చా జిల్లా నాయకుడు నిమ్మనపల్లి పురుషోత్తం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల స్టాపింగ్ కోసం వినతి

ప్రముఖ విద్యాలయాలు, జాతీయ రక్షణ రంగానికి సంబంధించి సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ వంటి కేంద్రాలకు నిలయంగా ఉన్న కలికిరిలో పలు రైళ్లు ఆగడం లేదని, ఆగడానికి చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ నేతలు బుధవారం మాజీ సీఎం కిరణ్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.